క్లుప్తంగా

టోల్ ప్లాజా వద్ద ఫిజియోథెరపీ శిబిరం



టోల్‌ప్లాజా వద్ద ఫిజియోథెరపీ శిబిరంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం ఉచిత ఫిజియోథెరపీ శిబిరాన్ని ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద నిర్వహించారు. ఫిజియోథెరపీ డాక్టర్లు సాయిగీత, చింతామోహిత్ టోల్‌ప్లాజా సిబ్బందికి అవగాహన కల్పించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. టోల్ ప్లాజా మేనేజరు ఇంతియాజ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టోల్ రూట్ మేనేజరు గంట సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



దెందులూరు తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

దెందులూరు: భారత గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని దెందులూరు తహసీల్దార్ బి సుమతి అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఆదివారం నిర్వహించే భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి సందేశాలను అందించాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, నర్సింగ్ డీఈడీ విద్యా సంస్థల్లో అంబరాన్నంటేలా సంబరాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో భీమడోలు



భీమడోలు జంక్షన్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ యూజే విల్సన్, ఎస్సై వై.సుధాకర్

భీమడోలు: ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, నేరస్తుల కదలికపై నిఘా ఉంచేందుకు పోలీస్ శాఖ భీమడోలు కూడలి ప్రాంతాల్లో సీసీ కెమెరాల బిగింపు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. ఇటీవల భీమడోలు సర్కిల్ పరిధిలో జరిగిన పలు చోరీలను పోలీసులు చాకచక్యంగా చేధించారు. నిందితులను పట్టుకుని బాధితులకు అండగా నిలిచారు. వారికి పోగొట్టుకున్న నగదును సైతం అందించి వారి కళ్లల్లో ఆనందాన్ని నింపారు. పోలీసు దర్యాప్తులో సీసీ కెమెరా పాత్ర కీలకంగా మారడంతో కూడలి ప్రాంతాల్లో 30 సీసీ కెమెరాలు చురుగ్గా ఏర్పాటు చేస్తున్నారు. భీమడోలు సీఐ యూజే విల్సన్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్ ఆధ్వర్యంలో ఎక్కువగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, నేరస్తులు సంచారం ఉండే ప్రదేశాల వద్ద కెమెరాలను సంబంధిత ఇంజనీర్లు అమర్చే పనులు చురుగ్గా చేస్తున్నారు. కెమెరాల అమరిక పనులను సీఐ, ఎస్సైలు శనివారం రాత్రి స్వయంగా పరిశీలించి టెక్నీషియన్లకు పలు సూచనలందిస్తున్నారు. భీమడోలు జంక్షన్‌లోనే 8 కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని, రాబోయే మూడు రోజుల్లో అన్ని చోట్ల కెమెరాలను ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందని వారు చెబుతున్నారు. సీసీ కెమెరాల భద్రతలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, వాటిని ధ్వంసం చేస్తే వారిపై కఠిన తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మేలు



శ్రీనివాసరావును కలిసిన గంటా సాయి, సత్యదేవ్, సునీల్‌కుమార్, జనార్దన్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు మేలు చేశారని, కూటమి ప్రభుత్వంలె పేదల బతుకులకు భరోసా లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు నగర అధ్యక్షుడిగా నియమితులైన ఆయన్ని పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నేటికీ ఎన్నికల హామీలను అమలు చేయలేని దుస్థితిలో ఉందని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసి చూపించి, రాజకీయాల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. పార్టీ నాయకులు గంటా సాయికుమార్, పిల్లంగోళ్ల సత్యదేవ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

డ్రాగన్ ఫ్రూట్ సాగు.. లాభాలు బాగు

- సాగుపై స్థానిక రైతుల్లో ఆసక్తి
- కిలో ధర రూ.150 నుంచి రూ.400
- తక్కువ పెట్టుబడితో అధిక ఆర్థిక ప్రయోజనం



దెందులూరు మండలం జోగన్నపాలెంలో డ్రాగన్ ఫ్రూట్ తోట



డ్రాగన్ ఫ్రూట్

దెందులూరు: పనిభారం లేకపోవడంతోపాటు తక్కువ పెట్టుబడి, సాగునీటి అవసరం పెద్దగా అవసరం లేకపోవడంతో పలువురు రైతులు డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో సాగు క్రమంగా పెరుగుతోంది. ఒక్కసారి పంట వేస్తే 32 ఏళ్ల వరకు దిగుబడి వస్తుంది. ధర కలిసి రాకపోయినా ఏడాదికి కనీసం రెండున్నర లక్షల రూపాయలు సంపాదించుకోవచ్చు. గతంలో దెందులూరు నియోజకవర్గంలో ఈ పంట జోలికి ఎవరూ వెళ్లిన దాఖలాల్లేవు. ఇప్పుడు నియోజకవర్గంలో పెదవేగిలోని సూర్యారావుపేట, రాట్నాలకుంట, కన్నాపురం, దెందులూరు మండలంతోపాటు పలు గ్రామాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేస్తున్నారు.

పోషకాలు గని డ్రాగన్ ఫ్రూట్

ఈ పంట వ్యాధినిరోధక శక్తిని పెంచడంతో పాటు కిడ్నీ సంబంధిత వ్యాధులకు, అజీర్ణ సమస్యలకు బాగా పనిచేస్తుంది. డ్రాగన్ ఫ్రూట్‌ను పిటాయా అని పిలుస్తారు. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉండటంతో పాటు మనిషి బరువు తగ్గడం, మధుమేహాన్ని అదుపు చేయడం, చర్మ సంరక్షణకు ఉపయోగపడే గుణం ఈ పండులో ఉంది. కరోనా తరువాత వీటిపై ప్రజలకు వాడకం పెరిగింది. దీంతో లాభాలు వస్తుండటంతో రైతులు కూడా పంటకు పండించేందుకు ముందుకు వస్తున్నారు.

భూ పరీక్ష ప్రధానం

దాదాపు ఎకరం భూమిని ముందుగా భూసార పరీక్షలు చేయించి నేలలో ఉదజని 7 శాతం ఉంటే సరిపోతుంది. ముందుగా దుక్కు దున్నాలి. ఏడు అడుగుల ఎత్తున సిమెంట్ స్థంబాలను ఏర్పాటు చేసి మొదటిసారి ఎకరానికి అన్ని ఖర్చులతో కలిపి సుమారు రూ. 4 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ఎకరా విస్తీర్ణంలో దాదాపు 500 సిమెంట్ స్తంభాలకు 1,500 నుంచి 2 వేల మధ్య డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను పెంచవచ్చు. తరువాత సంవత్సరానికి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు మాత్రమే పెట్టుబడి పెడితే సరిపోతుందని రైతులు చెబుతున్నారు.

పంట దిగుబడి

సీజన్‌లో ఒక్కో చెట్టుకు కనీసం 15 నుంచి 18 పండ్లు కాస్తాయి. వీటిని కిలో రూ.250 నుంచి రూ.300 వరకు మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. సీజన్‌లో కిలో రూ.150 నుంచి రూ.400 వరకు ఉంటుంది. సంవత్సరానికి రెండు పంటల చొప్పున 32 ఏళ్ల వరకు రైతులు ఆదాయం తీస్తారు. ఇప్పుడు రైతుల వద్దకు వచ్చి డ్రాగన్ ఫ్రూట్‌ను ఒక్కొక్కటి వంద చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం పట్టణాల్లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు మార్కెట్లకు తరలిస్తున్నారు.

పంటపై ప్రచారం అవసరం



సాగునీటి వినియోగం తక్కువ. పెట్టుబడి తక్కువ, నష్టాలు లేని పంటనే రైతులు ఎన్నుకోవాలి. అలాంటి కోవకు చెందిన పంటే డ్రాగన్ ఫ్రూట్. ఈ పంటపై ప్రభుత్వం ప్రచారం చేయాలి. నేనే ఈ పంట వేసినప్పుడు భయపడ్డాను ఇప్పుడు ధైర్యంగా ఉంది. ఎకరాకు రూ. 2 లక్షల వరకు లాభం వచ్చింది.

– గొరిపర్తి శ్రీనివాస్, రైతు, కొవ్వలి

డ్రాగన్ ఫ్రూట్ సాగుకు సబ్సిడీ

ఆసక్తి కలిగి డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం రెండున్నర ఎకరాలకు రూ. 30 వేలు చొప్పున సబ్సిడీ వస్తుంది. పొలంలో మొక్కలు నాటి పెంచిన తరువాత బిల్లులు అందజేయాలి. తమ సిబ్బంది క్షేత్ర స్థాయి పరిశీలన చేసి జియోట్యాగింగ్ అనంతరం సబ్సిడీ నగదును బ్యాంక్ అకౌంట్ల జమ చేస్తాం

– రామ్మోహనరావు, ఉద్యానవనశాఖ, జిల్లా జేడీ

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వడ్లపట్లలో ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జే.గోవిందరావు

భీమడోలు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి జే. గోవిందరావు అన్నారు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని వడ్లపట్లలో శనివారం సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశీలించారు. వారికి ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పంపేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. శీతాకాలంలో వైరస్‌లు విజృంభిస్తాయని, ఎక్కువగా దగ్గు, జలుబు, ఆయాసం, చికెన్ గున్యా, డెంగీ వంటి వ్యాధులు ప్రజలే అవకాశాలున్నాయని అన్నారు. వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఫ్రైడే రోజున డ్రైడేను ఆచరించాలని కోరారు. మురికి వాడల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించి కరపత్రాలు పంపిణీలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి కల్యాణీమహేశ్వరి, ఎంపీహెచ్‌ఈవో కిషోర్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి



కురెళ్లగూడెంలో శిథిలావస్థకు చేరిన రిటైనింగ్ వాల్‌ను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి ఆర్‌వీ నాగరాణి

భీమడోలు: కురెళ్లగూడెంలో ప్రాధాన్యత క్రమంలో సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని మండల ప్రత్యేకాధికారి, జిల్లా బీసీ సాంఘిక సంక్షేమాధికారిణి ఆర్‌వీ నాగరాణి అన్నారు. కురెళ్లగూడెంలో శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ఆర్‌ఎస్‌కే వద్ద గ్రామస్తులు, వివిధ శాఖల సిబ్బందితో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. గ్రామస్తులు నుంచి ఆమె సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని మూడు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు ప్రస్తుతం మరమ్మతులకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు నిర్మించాలని, డ్రెయినేజి సమస్యను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. హైవే పక్కనే వంతెన రిటైనింగ్ వాల్ శిథిలావస్థకు చేరి మరమ్మతులకు గురైందని, దీని వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. గ్రామంలో శుద్ధి చేసిన నీటిని అందించేందుకు కష్టంగా ఉందని పేర్కొన్నారు. కాలువ కింద ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును నూతనంగా నిర్మించాలని కోరారు. వాటిన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని నాగరాణి అన్నారు. అనంతరం జాతీయ రహదారిపై గల రిటైనింగ్ వాల్‌ను ఆమె పరిశీలించి, పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి ఇంటి గౌతమి, పెద్దలు గుడివాడ సీతారామాంజనేయులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

పెదపాడు: పాడి పశువులకు నట్టల నివారణ టీకాలు తప్పక వేయించాలని పశువైద్యురాలు డాక్టరు సీహెచ్ వాణీ సంధ్యశ్రీ తెలిపారు. పెదపాడు మండల పశువైద్య కేంద్రంలో శనివారం నట్టల నివారణ టీకాలు గర్భకోశ వ్యాధులకు చికిత్స అందించారు.

ప్రతి ఒక్కరూ జ్ఞాన సంపన్నులై వెలుగొందాలి



బిషప్ పొలిమేర జయరావు

దెందులూరు: ప్రతి ఒక్కరూ జ్ఞాన సంపన్నులై తాము దీపంలో వెలుగొందుతూ ఇతరులకు వెలుగును అందించాలని ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. శనివారం పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో స్థానిక చర్చి ఫాదర్ తంబిరుంజల ఆధ్వర్యంలో ఆలయ పదవ వార్షికోత్సవ వేడుకలు నిత్య సహాయ మాత ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు పీఠాధిపతి జయరావు మాట్లాడుతూ లోక మాత మరితల్లి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ నిరంతర ప్రార్థన దేవునికి ఇష్టమైన జీవన విధానంలో జీవించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఫాదర్ తంబి ఫాదర్ అమ్మన్ రాజ 20 మంది ఫాదర్లతో కలిసి పీఠాధిపతి దివ్య పూజ బలి అర్పించారు. నిత్య సహాయ మాత ఉత్సవాలకు విచ్చేసిన ఆయనకు పోతునూరు ఆర్‌సీఎం సంఘ, పెద్దలు సంఘస్తులు ఉపదేశీయులు, ఉపాధ్యాయులు, మరియదళ సభ్యులు, చిన్నారులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బిషప్ పొలిమేర జయరావుకు పోతునూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఆర్‌సీఎం చర్చి వరకు రోడ్డుకు రెండు వైపులా పూలు చల్లుతూ మేళతాళాలతో ర్యాలీగా ప్రజలు ఘన స్వాగతం పలికారు.

27న కొల్లేరు సమస్యపై సమావేశం



మాట్లాడుతున్న కొల్లేరు గ్రామాల నాయకులు

దెందులూరు: కొల్లేరులో ఆక్రమిత చెరువుల తొలగింపు అంశంలో సుప్రీంకోర్టు ఆదేశాలపై ఈ నెల 27న ఏలూరు వసంత మహల్ సెంటర్‌ని జాబిల్లి ఫంక్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు కొల్లేరు ఎస్సీ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశం ఏర్పాటు చేశామని చైర్మన్ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వల్లెం ప్రసాద్ కోరారు. శనివారం ఆయన నివాసంలో మాట్లాడుతూ ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవన విధానం భవిష్యత్తు భద్రత తీసుకోకుండా సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామనడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దశాబ్దాలుగా కొల్లేరును నమ్ముకుని కొల్లేరులో జీవిస్తున్న కొల్లేరు వాసుల భద్రత కల్పించాలని కోరారు. అందరి అభిప్రాయాలనూ పరిగణనలోకి తీసుకుని భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించేందుకు సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, కొల్లేరు నాయకులు, సొసైటీ ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మేధినరావుపాలెం సర్పంచ్‌కి సత్కారం

దెందులూరు: మేధినరావుపాలెం గ్రామ నాయకులు మనుబోలు రాజు, సర్పంచ్ మనుబోలు దుర్గకుమారిని నిత్య సహాయ మాత చర్చి పాస్టర్లు దాసు, లాజర్ ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఘనంగా సత్కరించారు. గ్రామంతోపాటు చర్చి అభివృద్ధికి సర్పంచ్ దంపతులు చేస్తున్న కృషి మరువలేమని వారన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ గొప్పది



ఉంగుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



భీమడోలు: పోలసానిపల్లిలో సీనియర్, కొత్త ఓటర్లకు సత్కారం



దెందులూరు: నూతన ఓటరుకు ఓటు కార్డు అందిస్తున్న దృశ్యం



గణపవరం: సీనియర్, నూతన ఓటర్లను సన్మానిస్తున్న తహసీల్దార్

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగస్వామ్యం కావాలని తహసీల్దారు పూర్ణచంద్రప్రసాదు అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఉంగుటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ ఓటు విలువ చాలా విలువైనదని వివరించారు. ఎంపీడీవో రాజ్‌మనోజు మాట్లాడుతూ మన దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శనీయమైనదని అన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్నికల డీటీ పోతురాజు, ఎన్నికల సీనియర్ అసిస్టెంటు సాయిరమేష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలి

భీమడోలు: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధమని పోలసానిపల్లి సర్పంచ్ షేక్ రహీమ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం మండల వ్యాప్తంగా పాఠశాలలు, రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాల వద్ద రంగవల్లులు, వ్యాసరచన పోటీలు, కొత్త ఓటర్లు, సీనియర్ ఓటర్లకు సన్మాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పోలసానిపల్లి పంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేసారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించారు. పంచాయతీ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్‌రాజు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు ప్రాథమిక పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మండే సుధాకర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. రంగవల్లుల పోటీలను నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

దెందులూరులో ర్యాలీ

దెందులూరు: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును పొందాలని దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు నాయకులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. నూతన ఓటర్లు సీనియర్ ఓటర్లకు యాదవ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెనుబోయిన మహేష్ యాదవ్, తహసీల్దార్‌తోపాటు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమమాలిని సత్కరించి ధ్రువీకరణ పత్రాలు అందించారు. కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఓటు విలువ వెలకట్టలేనిది

గణపవరం: మన భవిష్యత్తును మనమే నిర్ణయించుకునే శక్తి ఒక్క ఓటుహక్కుకు మాత్రమే ఉందని, ఓటు విలువ వెలకట్టలేనిదని గణపవరం తహసీల్దార్ వీఏ అప్పారావు, ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ నిర్మలకుమారి అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గణపవరం డిగ్రీ కాలేజిలో సీనియర్ ఓటర్లను, కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ మధురాజు, రెవెన్యూ సిబ్బంది, కాలేజి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలి

పెదపాడు : ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి తెలిపారు. పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శనివారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పెదపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పీ వెంకటేశ్వరరావు వీఆర్వో నర్సింహ పాల్గొన్నారు.

తరతరాలకూ స్ఫూర్తి ప్రదాత అంబేడ్కర్

భీమడోలు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ తరతరాలకూ స్ఫూర్తి ప్రదాత అని జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అన్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 75వ సంవిధాన్ గౌరవ్ దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు బుద్రె మూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, జోన్ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మత్తే శ్రీనివాసశాస్త్రి పాల్గొన్నారు.

అత్యుత్తమమైనది భారతదేశ రాజ్యాంగం



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గణపవరం: ప్రపంచ దేశాల్లో అమలులోఉన్న రాజ్యాంగాల కన్నా మన దేశ రాజ్యాంగం అత్యుత్తమమైనదని బీజేపీ సీనియర్ నాయకులు కూనిరెడ్డి సోమేశ్వరరావు, నంద్యాల రామలింగరాజు అన్నారు. శనివారం గణపవరంలో భారత గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా 75వ సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి మనిషికి వాక్ స్వాతంత్ర్యం, స్వేచ్ఛ, భావ ప్రకటన, మత విశ్వాసాలను గౌరవించడం వంటి ఎన్నో అమూల్యమైన హక్కులను ప్రసాదించిందని అన్నారు. ఈ సందర్భంగా భారతమాత, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కలెక్టరు చేతుల మీదుగా జిల్లా విజేతలుగా సర్టిఫికెట్లు అందుకున్న దృశ్యం

ఉంగుటూరు: జిల్లా కలెక్టరు వెట్రిసెల్వి చేతుల మీదుగా నారాయణపురం డిగ్రీ కాలేజీ విద్యార్థులు సర్టిఫికెట్లు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో జి.అనూష, బి.సుమంత్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. ఈక్రమంలో శనివారం ఏలూరులో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు కలెక్టరు ప్రశంసలు అందుకున్నారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అభినందించారు.

పాస్‌పోర్టు పోయినది

షైక్ రఫీ S/o. ఖద్రుస్సేన్, సీతంపేట, కొత్తగూడెం పంచాయితీ, దెందులూరు మండలం వీరికి సంబంధించిన ఇండియన్ పాస్‌పోర్ట్ నెం. R2802113 జిరాక్స్ నిమిత్తం ఇంటి నుండి సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించి అందజేయగలరు.
సెల్: 9701416673